కులవృత్తి అంటే అతనికి చిన్న చూపు, అసహ్యం. తండ్రిని, తనను ఎవరైనా చూస్తే తనను ఎగతాళి చేస్తారని భయం! తన మిత్రుడు రవి చేస్తున్న పనులన్నీ చూశాక అతనికి కనువిప్పు అయింది. తనదాకా వస్తేనే కదా తెలిసేది ఎవరికైనా!

# కొత్త జాలరి

దాసరి విజయభాస్కర్

ఉవ్వెత్తున లేచిన కెరటం ముందుకు దూకి రెట్టింపు వేగంతో వెనుకకు పరుగుదీసింది. ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టింది. సముద్రం చల్లదనానికి ఇసుక రేణువులు చల్లబడసాగాయి.

నల్లటి శరీరాలతో గోచీలను ధరించిన జాలరుల పిల్లలు కేరింతలు కొడుతూ అలలతో ఆడుకోసాగారు. కొంతమంది కుర్రవాళ్ళు సముద్ర స్నానాలు చేసే ఆడవారి తడిసిన ఒంపుసొంపులను క్రీగంట గమనించసాగారు.

సముద్రమంటే భయపడే పిల్లలు ఒడ్డున నిలబడి కేరింతలు కొట్టసాగారు. వాతావరణం ఆహ్లాదంగా అందరి మనస్సులనూ రంజింపచేస్తూంది.

ఆ వాతావరణానికి దూరంగా ఒక ఇసుక తిన్నెపైన కూర్చొని సముద్రం వైపు గంభీరంగా చూడసాగాడు కిషోర్. సముద్రం చేసే అలల సవ్వడి కిషోర్ గుండెను సున్నితంగా తాకసాగింది. ఎందుకో కిషోర్ ముఖంలో నీలినీడలు వ్యాపించసాగాయి. నీలిరంగులో ఉన్న సముద్రం తనను మరింత వెక్కిరిస్తున్నట్లనిపించి, కోపంతో పక్కనున్న రాయిని తీసుకొని కసిగా విసిరాడు. సముద్రం అంతకంటే కసిగా మింగేసిందీ దాన్ని.

గాలివాటుగా తన చెవికి చేరిన అరుపులు విని తల తిప్పి చూశాడు.

కిషోర్. పెద్ద పెద్ద చేపలు వలలో పడినట్లున్నాయి. సంతోషంతో చిన్నపిల్లల్లా అరుస్తూ వాటిని బుట్టల్లోకి చేర వేస్తున్నారు జాలరులు.

తల తిప్పి సముద్రం వైపు చూశాడు కిషోర్. దూరంగా సముద్రంలో లంగరు వేసి ఉన్న పెద్ద ఓడ నీటి కదలికలకు అనుగుణంగా చిన్నగా ఊగసాగింది.

"అరే పెద్దాడా! పెద్దాడా!"

పిలుపు వినిపించిన వైపు తల తిప్పి చూశాడు కిషోర్. దూరంగా పడవ దగ్గరనుంచి నల్లటి ఆకారం తన వైపే తడబడే అడుగులతో పరుగెత్తుకు రాసాగింది. ఆ ఆకారం కిషోర్ తండ్రి యాదయ్యది.

తనను కాదన్నట్లు తల తిప్పి సముద్రం వైపు చూడసాగాడు.

"...పెద్దాడా! ఈయాల యాటలో శానా సావలు పడ్డాయిరా అయ్యా! ఓపారి సూద్దువుగాని దా." ఆనందంతో ఆయాసపడుతూ చెప్పాడు యాదయ్య.

చిన్నగా తల తిప్పి తండ్రి వైపు చూశాడు కిషోర్. నల్లటి శరీరం పైన ఉప్పు చారికలు తెల్లగా మెరుస్తున్నాయి. మొలకు చిన్న గోచీ తప్ప మరే ఆచ్ఛాదనా ఒంటిపైన లేదు. నీటిలో నానిన పాదాలు మొద్దుగా, ఉబ్బి అసహ్యంగా కనిపిస్తున్నాయి. మెడలో నల్ల తాయెత్తు శరీరం రంగులో కలిసిపోయింది. పరుగెత్తి రావటం వలన ఆయాసంతో రొమ్ము ఎగిరెగిరి పడసాగింది. గార పట్టిన పళ్ళను ఇకిలిస్తూ, తన వైపే ఆపాయంగా చూస్తున్న తండ్రి ఆకారాన్ని చూడగానే కిషోర్ ఒళ్ళు ఒక్క క్షణం జలదరించింది.

"పెద్దాడా!" తను తాకితే కొడుకుకు మురికంటుకుంటుందేమోనని దూరంగా నిలబడి తన వైపే చూస్తున్న కిషోర్ నుద్దేశించి ఆప్యాయంగా పిలిచాడు యాదయ్య.

తప్పదన్నట్లు లేచి తండ్రి వెంట నడవసాగాడు కిషోర్. అందరూ తన వైపే వింతగా చూస్తున్నట్లనిపించింది. స్నేహితులెవరైనా కనిపిస్తే తను ఒక జాలరి కొడుకునని తెలిసిపోతుందేమోనని. అందులో తన తండ్రి అవతారం చూస్తే అసహ్యించుకుంటారేమోనని మనసులో మథనపడుతూ నడవసాగాడు. అందుకే యాదయ్యకు కొద్ది దూరంగా నడుస్తున్నాడు. ఇవేమీ తెలియని యాదయ్య ఈ రోజు వేటలో ఎక్కువ మొత్తంలో పడ్డ పెద్ద పెద్ద చేపల్ని కొడుక్కు చూపించాలనే సంతోషంతో పెద్ద పెద్ద అంగలేస్తూ నడవసాగాడు.

కిషోర్ తల్లి కిషోర్ పుట్టిన ఐదవ యేట ఒక అమ్మాయిని ప్రసవించి కన్ను మూసింది. కిషోర్ చెల్లెలు నల్లగా ఉన్నా అందంగా శిల్పంలా ఉంటుంది. లక్ష్మీదేవి లాంటి కూతురు పుట్టిందని యాదయ్య ఆ పిల్లకు 'శ్రీలక్ష్మి' అని పేరు పెట్టాడు. కిషోర్ పుట్టినప్పటి నుండీ "పెద్దాడా!" అనే అందరూ పిలిచేవాళ్ళు. చదువుకుంటానని రోజూ పోరు పెడుతున్న కొడుకును ఒకరోజు స్కూల్లో చేర్పించాడు యాదయ్య. ఆ స్కూలు మాస్టారే "కిషోర్" అని పేరుపెట్టి రిజిస్టర్‌లో రాసుకున్నాడు. అప్పటినుంచి శ్రద్ధగా చదివిన కిషోర్ పదవ తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు.

హైస్కూలు మాస్టర్లంతా ఒత్తిడి చెయ్యటంతో తలకుమించిన భారమైనా కిషోర్‌ను కాలేజీలో చేర్పించక తప్పింది కాదు యాదయ్యకు. ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ, డిగ్రీ చదువుతో కాలేజీ చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాడు. యూనివర్సిటీ చదివే స్తోమత లేకపోవటంతో ఉద్యోగాన్వేషణలో విసిగి వేసారి, ఒకవైపు తన తండ్రి వృత్తి చేపట్టలేక సతమతమౌతూ ఖాళీగా గడుపుతున్నాడు కిషోర్.

కిషోర్ అందంగా పసుపు పచ్చని మేనితో మరింత ముచ్చటగా ఉండేవాడు. కిషోర్‌కు వాళ్ళమ్మ రంగూ అందమూ వచ్చాయని ఎప్పుడూ అంటుండేవాడు యాదయ్య. యాదయ్య కొడుకును చదివించటంలో ఎవరి పిల్లలతోనూ తీసిపోకుండా, నలగని ఇస్త్రీ గుడ్డలతో పెంచి పెద్ద చేశాడు. యాదయ్యకు కిషోర్ అంటే పంచ ప్రాణాలు. కొడుకులోనే తన భార్యను చూసుకొని ఆనందించేవాడు. చేపల వేటకు ఏనాడూ కిషోర్‌ను పిలిచేవాడు కాదు. ప్రాణం బాగున్నా లేకపోయినా తనే వెళ్ళేవాడు.

పడవ దగ్గర కోలాహలంగా ఉంది. జాలరులంతా ఆ చేపలమ్మితే రాబోయే డబ్బుల గురించి మాట్లాడుకోసాగారు. సముద్ర స్నానాలకు వచ్చిన వాళ్ళంతా ఆ చేపల్ని వింతగా చూస్తున్నారు. గోచీలు పెట్టుకున్న పిల్లలు ఆ చేపల్ని చేత్తో తాకటానికి ప్రయత్నిస్తుంటే, పెద్దవాళ్ళు వాళ్ళను గట్టిగా కసురుకోసాగారు. ఆ ప్రదేశమంతా సందడిగా ఉండి గుంపుగా ఉన్నారు జనమంతా.

ఆ గుంపులోని వారందరినీ ఒక్కసారి పరికించి తనకు తెలిసిన వారెవ్వరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత కిషోర్ మనస్సు తేలిక పడింది. తను కూడా చేపల వైపు దృష్టి సారించాడు.

"నిజమే... చాలా పెద్ద చేపలే పడ్డాయి..." మనసులో అనుకున్నాడు.

"సూశావా పెద్దాడా! ఎంత పెద్ద సావలో!" కొడుకు ముఖంలోకి చూస్తూ ఆనందంతో అన్నాడు యాదయ్య.

"అవును. చాలా పెద్దవే. నే ఇంటి కెళ్తున్నా" తండ్రి వైపు చూసి చెప్పాడు కిషోర్.

కొడుకు నోటివెంట వచ్చిన ఆ మాటకే ఉబ్బిపోయాడు యాదయ్య. "అట్టాగే పెద్దాడా. నే నియన్నీ అమ్మి గుడిసె కొచ్చేసరికి శానా ఆలీస మౌతది. నువ్వెళ్ళి ఇంత కూడు తిని పడుకోరా అయ్యా. లచ్చిని కూడా తిని పడుకోమను." వెళ్తున్న కొడుకు నుద్దేశించి చెప్పాడు.

మెల్లగా చీకట్లు వ్యాపించసాగాయి. కిషోర్ వెళ్ళేసరికి లక్ష్మి గుడిసెలో దీపం వెలిగిస్తూ కనిపించింది. కిషోర్‌ను గమనించిన లక్ష్మి కాళ్ళు కడుక్కోడానికి చెంబుతో నీళ్ళు ఇచ్చింది. కిషోర్ చెల్లెలి బుగ్గ గిల్లుతూ చెంబందుకున్నాడు.

"ఛీ...పో... అన్నయ్యా!" చెంప నిమురుకుంటూ అన్నం వడ్డించడానికి వంట గదిలోకి దూరింది పదహారేళ్ళ లక్ష్మి.

కిషోర్‌కు తన-కుటుంబ పరిసర సభ్యుల మొత్తంలో తన చెల్లి లక్ష్మి తప్ప మరేదీ ఆకట్టుకోలేదు. లక్ష్మి పొందికగా లంగా వోణీ ధరించి, నుదుటి పైన చిన్న బొట్టు, మధ్య పాపిడితో రెండు జడలు వేసుకొని చిరునవ్వు ముఖంతో చూడ ముచ్చటగా ఉంటుంది. అంతేగాక ఐదో తరగతి దాకా చదువుకున్నందు వలన మాట్లాడేటప్పుడు యాస ఉండదు. అందుకే కిషోర్ లక్ష్మిని ప్రాణంగా చూసుకుంటాడు.

అన్నం తినటం రెండు నిముషాల్లో పూర్తి చేసి, ఆరుబయట నులకమంచం వేసుకొని పడుకొని, ఆకాశంలోని నక్షత్ర లను చూస్తూ ఆలోచించ సాగాడు కిషోర్.

"ఏం ఉన్నయ్యా, ఆలోచిస్తున్నావ్?" తిన్నచోట సర్దేసి కిషోర్ పక్కన కూర్చుంటూ అడిగింది లక్ష్మి.

"ఏం లేదమ్మా. నా ఫ్రెండ్ రవి లేడూ-వాడిని ఒకసారి చూసిరావాలని పించీ..."

"రేపొక సారి వెళ్ళి రాకూడ దన్నయ్యా! రవి అన్నయ్య మనింటికి వచ్చి దాదాపు సంవత్సరం కావస్తోందా?" కిషోర్ మాట పూర్తి కాకముందే చెప్పింది లక్ష్మి.

"అలాగే రేపొకసారి వెళ్ళొస్తా. నాకు నిద్రొస్తుంది నువ్వెళ్ళి పడుకోమ్మా." కళ్ళు మూసుకుంటూ చెప్పాడు కిషోర్.

లక్ష్మి గుడిసెలో కెళ్ళి పడుకుంది. పగలంత పనులతో, ఆటలతో అలసిపోయిన లక్ష్మికి వెంటనే నిద్ర పట్టింది.

** ** **

"రవీ!"

బర్రె పాలు పితుకుతున్న రవి తలెత్తి చూశాడు. ఒక్క క్షణం ఆశ్చర్యం.

"అరె... కిషోర్! ఎప్పు డొచ్చావు? బాగున్నావా?" పాల బిందెను పక్కన పెడుతూ ఆప్యాయంగా పలకరిస్తూ స్నేహితుడు కూర్చోవటానికి మంచం వాల్చాడు రవి.

"నా సంగతి సరే. నువ్వేంట్రా ఇలా...!" సందిగ్ధంగా ఆగాడు కిషోర్.

"అవన్నీ తర్వాత చెప్తాను. ముందు నువ్వెలా ఉన్నావు? ఏం చేస్తున్నావు? లక్ష్మి, మీ నాన్నగారూ బాగున్నారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు రవి.

"అందరూ బాగున్నారు. లక్ష్మి నిన్ను వెంట బెట్టుకొని తీసుకురమ్మంది. ఇంక నా విషయమంటావా, మామూలే. నీకు తెలియని దేముంది? ఈ కాలం డబ్బు, పలుకుబడి లేకుండా ఉద్యోగాలు రావట మంటే మాటలా? హైదరాబాదు లాంటి సిటీ కెళ్తే ఏదైనా ప్రైవేటు సంస్థలో చాలీచాలని డబ్బుతో ఉద్యోగం దొరుకుతుంది. అయినా నా వాళ్ళందర్నీ విడిచి దూరంగా ఉండటం కష్టం. అందుకే ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నా... మరి నువ్వు...?" తన గురించి క్లుప్తంగా నాలుగు ముక్కల్లో చెప్పి స్నేహితుని వైపు ప్రశ్నార్థకంగా చూశాడు కిషోర్.

రవి ముఖం వివర్ణమైంది. తిరిగి పాలు పితకటంలో లీనమయ్యాడు. కిషోర్ స్నేహితుని సమాధానం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

"ఇదిగో అన్నయ్యా పాలు..." అప్పుడే ఇంట్లోంచి చిక్కటి పాలు వేడి చేసి తీసుకొచ్చింది రవి చెల్లెలు నిర్మల.

ఆ పిలుపుతో తల తిప్పి చూసిన కిషోర్ నవ్వు ముఖంతో-"ఏమ్మా బాగున్నావా?" పలకరించాడు.

సమాధానంగా చిన్నగా నవ్వింది నిర్మల. ఆ నవ్వులో ఏదో బాధతో కూడిన భావన. పాలగ్లాసు కిషోర్‌కు అందించి లోపలి కెళ్ళింది.,

పాలు తాగుతూ రవి వైపు చూస్తూ కూర్చున్నాడు కిషోర్. రవి ఐదు నిముషాల్లో పాలు పితకటం పూర్తి చేసి, గబగబా బర్రెలకు గడ్డివేసి కాళ్ళూ, చేతులూ శుభ్రంగా కడుక్కొని స్నేహితుని పక్కన కూర్చున్నాడు. తన వైపు వింతగా చూస్తున్న కిషోర్ నుద్దేశించి చెపసాగాడు రవి.



## మంచి పద్యం

ద్యుమణి పద్మాకరము వికచముగ జేయు
కుముదహర్షంబు గావించు నమృతసూతి
అర్థితుడు గాక జయమిచ్చు నంబుధరుడు
సజ్జనులు దారె పరహితా చరణమతులు.

— ఆపదలో ఉన్నవాళ్ళకీ - కష్టాల్లో బాధపడే వాళ్ళకీ మనంతట మనం సహాయం చెయ్యం. అడిగితే 'చేద్దాం' అనుకుంటారు కొందరు. 'మనకెందు కొచ్చింది' అని మూతి తిప్పుకుంటారు ఇంకొందరు. అంతా ఇలాగే వుంటే లోకానికి మనుగడ ఏముంటుంది?

సూర్యోదయం వల్ల తామర పువ్వులు వికసిస్తున్నాయి. చంద్రుడి వల్ల కలువ పువ్వులు వికసిస్తున్నాయి. మరి ఆ పువ్వులు రోజూ సూర్య చంద్రుల్ని 'వికసింపజేయండి' అని ప్రాధేయ పడటం లేదు కదా! మేఘాలు కూడా అడగకుండానే వర్షిస్తున్నాయి. అవి ఎవరైనా అడిగితే చేద్దామను కొని భీష్మించుకుంటే లోకం ఏమవుతుంది? అలాగే ఇతరులు అర్థించకుండానే తమంత తాముగా ఇతరులకు సహాయం చేయటం మంచివాళ్ళ లక్షణం. "వాళ్ళు వచ్చి అడగాలి. ప్రార్థించాలి" అనుకోకుండా పరోపకారం చెయ్యాలని భర్తృహారి సంస్కృతంలో చెప్తే - ఏనుగు లక్ష్మణ కవి తెలుగు పద్యంలో చెప్పాడు.

'ద్వాదశి'

"కిషోర్ ! కాలేజీ చదివే రోజుల్లో ఎంతో సరదాగా ఏ బాధ్యతలూ లేకుండా, కష్టమనేది తెలియకుండా గడిపాను. అందరి దృష్టిలో లక్షాధికారి బిడ్డగా చెలామణి అవ్వాలని రోజు కో రకం బట్టలు వేసుకుంటూ, ధారాళంగా ఖర్చు పెడుతూ వచ్చాను. కాని మేము పాల వ్యాపారం చేస్తామన్న విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తగా వ్యవహరించాను. ఆఖరికి నీకు కూడా చెప్పలేదు. చెప్తే నన్ను చులకనగా చూస్తావనే భయంతో చెప్పలేదు. అప్పట్లో నిన్ను ఇంటికి రమ్మని పిలిచే వాడినే కాని ఎప్పుడు కూడా నిన్ను తీసుకువెళ్ళే వాడిని కాను. అలా మెల్లగా కాల ప్రవాహంలో మన డిగ్రీ పూర్తయింది. కాలేజీకి గుడ్‌బై చెప్పేశాము. ఇక జీవితాన్ని జాలీగా గడపవచ్చునని ఎన్నెన్నో కలలు కన్నాను. అటువంటి పరిస్థితుల్లో ఒకరోజు మా అమ్మ......" కళ్ళల్లోనీళ్ళు తిరిగి చెప్పలేకపోయాడు రవి.

స్నేహితుని కంట్లో తడి చూసి చలించి పోయాడు కిషోర్. రవి చెప్పే విషయం అర్థమైంది కిషోర్‌కు. నిగ్రహించుకో మన్నట్లుగా భుజం తట్టాడు. రవి కళ్ళనీరు దిగమింగుకుంటూ చెప్పసాగాడు.

'......మాకు జీవితమంతా చాకిరి చేసి చేసి అలసిపోయిన అమ్మ, ఒకరోజు గుండె నొప్పితో కాలం చేసింది. మా నాన్నకు తాగుడు అలవాటు. అయితే ఎక్కువ తాగకుండా మా అమ్మ బెదిరించో, ఏడ్చో ఎలాగోలా కొంత అదుపు చేస్తూ వచ్చింది. మా అమ్మ చనిపోయిన తర్వాత మా నాన్న తాగుడుకు పూర్తిగా బానిసైపోయాడు. నీకు చెప్పుండే వాడిని గుర్తుందారా కిషోర్? నా కిద్దరు చెల్లెళ్ళున్నారని. ఇప్పుడు నువ్వు చూసినది చూసిన పెద్దమ్మాయి. రెండో చెల్లెలు స్కూలు కెళ్ళింది. పెద్ద చెల్లికి పెళ్ళి చెయ్యాలి. రెండో చెల్లి కూడా పెళ్ళి కెదిగింది. ఆస్తి అంటూ ఏదన్నా ఉన్నా అదంతా మా నాన్న తాగుడుకె ఖర్చయి పోయింది. నిజంగా ఒరే కిషోర్! బాధ్యత లంటే ఏమిటో, డబ్బు విలువ... తల్లి విలువ ఇప్పుడు తెలిశాయిరా! ఇప్పుడు నాకు బాధగా లేదురా. కష్టపడుతున్నాను. శ్రమకు తగ్గ ఫలితం వస్తూంది. ఇంతకుముందున్న తెలియని తనం, న్యూనతా భావం ఇప్పుడు లేవు. పాలు పోస్తూ స్వయంగా సంపాదిస్తూ గర్వంగా ఉంటున్నా... కాకపోతే నా చెల్లెళ్ళిద్దర్నీ పెళ్ళి చేసి పంపే వరకు కాస్తా ఎక్కువ శ్రమ పడవలసి వస్తుంది. అయినా నాకు బాధ అనిపించటం లేదు. ఇందులో ఎంతో ఆనంద ముంది. ఎందుకంటే అందరూ మన కెందుకులే అనుకుంటే ఎవరి జీవితాలూ బాగుపడవు. మనం బ్రతికేది ఒకరి కోసం కాదు, మన కోసమనే జీవిత సత్యాన్ని ఆలస్యంగా నైనా తెలుసుకున్నందుకు ఎంతో గర్వపడుతున్నారా!" ఆవేశంతో చెప్తున్న రవి కిషోర్ కంట్లో తడి చూసి చెప్పటం ఆపాడు.

ఎంతో ఉన్నతమైన స్థాయిలో ఉన్న రవి ఆలోచనల ముందు కిషోర్ మనస్సు సిగ్గుతో చితికి పోయింది. చదువుతో పాటు సంస్కార పూరితమైన నైతిక విలువలను తెలుసుకోనందుకు హృదయం కుమిలిపోయింది. తన తండ్రి తన కోసం పడే శ్రమ, తన పైన చూపే ప్రేమ, కరుణ, ఆప్యాయత... వెయ్యి జన్మ లెత్తినా అటువంటి తండ్రి తనకిక దొరకడు... అటువంటి తండ్రిని అసహ్యంతో, న్యూనతా భావంతో చూసే తన ప్రవర్తన ఒక్కసారిగా గుర్తొచ్చి దుఃఖం పొంగుకొచ్చింది. ఏడుపును ఆపుకోలేక బావుర మన్నాడు కిషోర్.

"రే... కిషోర్... సారీరా! నా కథంతా చెప్పి నిన్ననవసరంగా బాధ పెట్టాను..." స్నేహితుని అనునయిస్తూ అన్నాడు రవి.

"లేదురా. నిజంగా నువ్వు, నీ మనస్సు ఎంతో ఎత్తు కెదిగాయిరా. నేనే ఇంకా అజ్ఞానంలో ఉన్నాను. నా ప్రేమకై తపించే నా తండ్రి మనస్సు ఇన్నాళ్ళూ అర్థం చేసుకోలేక పోయాను. నిజం చెప్పాలంటే కసాయివాడిలా నా తండ్రి శ్రమను ఇన్నాళ్ళూ దోచుకున్నారా. నాకు నువ్వు జ్ఞానోదయం కలిగించావురా. అందుకే... అందుకేరా ఈ కన్నీరు! పశ్చాత్తాపంతో ఇప్పుడు నా మనస్సెంత కుమిలి పోతూందో నీకు తెలీదురా. ఒరే... రవీ! ఇకనుంచి మా నాన్నకు చేదోడుగా ఉండి మా వృత్తి ఆనందంతో స్వీకరించి జీవితాన్ని వెన్నెల బాట చేసుకుంటారా."

** ** **

ఉవ్వెత్తున లేస్తున్న కెరటాలు దూరం నుంచి ఆహ్వాన గీతికలు పలుకుతుంటే కిషోర్ మనస్సు పులకించి పోయింది. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. నీలిరంగు సముద్రం మరింత అందంగా కనపడుతుంది. సముద్రం దగ్గరయ్యే కొద్దీ జాలరుల కోలాహలం పెద్దగా వినపడుతోంది. ఎందుకో ఆ వాతావరణం ఆహ్లాదంగా ఉందనిపిస్తోంది కిషోర్‌కి. నడక వేగం పెరిగింది. ఎవరి కోసమో కళ్ళు వెతకసాగాయి.

అదిగో, దూరంగా భుజాన వల వేసుకొని ఆ బరువుకు విల్లులా వంగిన నడుముతో వేటకు వెళుతున్న యాదయ్య కనిపించాడు కిషోర్‌కి. అంతే! పరుగెత్తు కెళ్ళి యాదయ్య కాళ్ళపైన పడ్డాడు కిషోర్. కాళ్ళను రెండూ గట్టిగా పట్టుకొని గుండెలోని బాధంతా కరిగి సముద్రంలో కలిసిపోయేలా ఏడ్చాడు.

యాదయ్య గాభరా పడ్డాడు. కొడుకు తన కాళ్ళను పట్టుకొని ఏడుస్తుంటే మరింత కంగారు పడ్డాడు. భుజాన ఉన్న వల జారిపోయింది.

"పెద్దాడా! పెద్దాడా! ఏమైందయ్యా? ఒరన్నా ఏమైనా అన్నారా?" కిషోర్‌ను పైకి లేపుతూ చిన్న పిల్లాడి నడిగినట్లు అడిగాడు యాదయ్య.

"నన్ను క్షమించు నాన్నా. చదువుకున్నాననే అహంకారంతో నిన్ను అసహ్యించు కొనేవాణ్ణి. ఒంట్లో బాగున్నా లేకపోయినా నువ్వే రోజూ వేట కెళ్ళి వచ్చేవాడివి. మాట వరసకైనా నన్ను రమ్మని ఏనాడూ అనలేదు. ఎందుకు నాన్నా! నేనంటే నీ కంత ప్రేమ! నాన్నా నీ ప్రేమను ఇన్నాళ్ళూ గుర్తించనందుకు సిగ్గు పడుతున్నా. నన్ను క్షమించు నాన్నా! క్షమించు." వెక్కిళ్ళతో ఇంక మాట్లాడలేక పోయాడు కిషోర్.

చెట్టంత కొడుకు ఏడుస్తూ పశ్చాత్తాపంతో పలుకుతున్న మాటలు విని యాదయ్య గుండె చెరువైంది. కొడుకును కౌగలించుకొని బోరున ఏడ్చాడు.

"నాన్నా! నువ్వింక వేటకు వెళ్ళ నవసరం లేదు. ఈ రోజు నుంచి నేనే వేటకు వెళ్తా. వద్దనకు నాన్నా. కనీసం ఈ విధంగా నైనా నా తప్పును కొంత దిద్దుకోనీ. అంతేకాదు నాన్నా నా చెల్లెలి పెళ్ళి నా సంపాదనతో నా చేతుల్తో నేను ఘనంగా చెయ్యాలి." దృఢంగా అంటూ కిందపడ్డ వలను భుజాన వేసుకొని సముద్రం వైపు అడుగులు వేశాడు కిషోర్.

ఇదంతా దూరం నుంచి చూస్తున్న లక్ష్మి మనస్సు పులకించి పోయింది.

సముద్రం కొత్త జాలరికి స్వాగతం పలికింది. ★